క్లుప్తంగా

డిజిటల్ ఫొటోగ్రఫీలో కోర్సులకు ఆహ్వానం

విజయనగర్‌కాలనీ: మాసబ్‌ట్యాంక్ జేఎన్‌ఏఎఫ్‌ఏ వర్సిటీలో భాగమైన ప్రభుత్వ ఫైన్ ఆర్ట్స్ కళాశాల ఆధ్వర్యంలో డిజిటల్ ఫొటోగ్రఫీలో స్వల్పకాలిక కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు ఫొటోగ్రఫీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఏఆర్ కమల్‌రాయ్ తెలిపారు. అభ్యర్థులు ఈనెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు వర్సిటీలోని ప్రభుత్వ లలితకళల కళాశాల ప్రిన్సిపాల్‌ను లేదా 72073 09581, 98851 20948 లలో సంప్రదించవచ్చని సూచించారు.

'కుడా' కార్యదర్శిగా శంకర్‌లాల్



చార్మినార్: కులీ కుతుబ్‌షా నగరాభివృద్ధి సంస్థ (కుడా) కార్యదర్శిగా ఆర్.శంకర్‌లాల్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు అదనపు బాధ్యతలు చేపట్టిన గురువీర నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. గతంలో జీహెచ్‌ఎంసీ దక్షిణ మండలం ఎస్‌ఈగా పని చేసిన ఆయనను ప్రభుత్వం కుడా కార్యదర్శిగా నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుడా ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో ఎన్నో ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టులను జరగనున్నాయని.. ఇప్పటికే కొన్ని హెరిటేజ్ కట్టడాల రెన్యూవేషన్ జరుగుతుందన్నారు.

గోవులను కాపాడిన గో రక్షాదళ్, గోజ్ఞాన్ సభ్యులు



అబిడ్స్: గో వధ శాలలకు తరలిస్తున్న 97 గోవులను తెలంగాణ గో రక్షాదళ్, గోజ్ఞాన్ ఫౌండేషన్ సభ్యులు రక్షించారు. నాలుగు డీసీఎం వాహనాలలో కబేళాలకు తరలిస్తున్న గోవులను ధూల్‌పేట, జియాగూడ ప్రాంతాల నుంచి తరలివెళ్లిన సభ్యులు ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలోని ఘట్కేసర్ ప్రాంతంలో కాపాడారు. కాపాడిన గోవులను జియాగూడ గోశాలతో పాటు నాగోలు గోశాలకు తరలించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ గో సంరక్షణ దళ్ సభ్యులు కోటి శ్రీధర్, గో రక్షాదళ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కాలూసింగ్, ప్రధాన కార్యదర్శి పవన్‌రెడ్డి, గోజ్ఞాన్ ఫౌండేషన్ సభ్యులు గౌగన్, నితీష్, విజయ్, మోహన్, ప్రశాంత్, ప్రవీణ్, చింటు, శ్రీకాంత్, సందీప్, మాయారేష్ పాల్గొన్నారు.

బ్యాలెట్ పద్ధతిలో ఎన్నిక



పెంజర్ల శ్యాంకుమార్‌ను అభినందిస్తున్న మహిళలు

చార్మినార్: పురానాపూల్ స్వామి వివేకానంద నగర్‌లోని మాదిగ అభ్యుదయ సంఘం ప్రధాన కార్యదర్శిగా పెంజర్ల శ్యాంకుమార్ ఎన్నికయ్యారు. బస్తీలో 1450 మంది అర్హులైన ఓటర్లుండగా.. ఇందులో 1179 మంది బ్యాలెట్ పేపర్ పద్ధతి ద్వారా ఓటింగ్‌లో పాల్గొన్నారని ఎన్నికల అధికారి తెలిపారు. ఇందులో ప్రధాన కార్యదర్శి పదవికి ఇద్దరు పోటీ పడగా.. పెంజర్ల శ్యాంకుమార్‌కు 834 మంది ఓట్లు వేశారు. దీంతో ఎన్నికల అధికారి ఆయనను ప్రధాన కార్యదర్శిగా ప్రకటించారు. ఆదివారం స్వామి వివేకనందన్‌నగర్‌లో ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. పలువురు అధికార, అనధికార ప్రముఖులు ఆయనను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

బ్యానర్లు చింపిన వారిపై ఫిర్యాదు



గోల్కొండ పోలీసులకు ఫిర్యాదు పత్రాన్ని అందజేస్తున్న బీజేపీ నాయకులు

గోల్కొండ: ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటంతో గోల్కొండ కోటలో ఏర్పాట చేసిన జీ-20 సదస్సు బ్యానర్‌ను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు ఆదివారం గోల్కొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జీ-20 ప్రతినిధి బృందం గోల్కొండ కోటను సందర్శించిన సందర్భంగా కోట వద్ద ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటం ఉన్న జీ-20 బ్యానర్‌ను ఏర్పాటు చేశారు. దీనిని కొందరు సంఘ విద్రోహ శక్తులు ఉద్దేశపూర్వకంగా చించివేశారని, అటువంటి వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో బీజేపీ నాయకులు శ్రీకాంత్, ఇంద్రసేనారెడ్డి, గోవర్ధన్‌రావు తదితరులున్నారు.

కొమ్మలన్నారు.. చెట్లనే నరికేశారు!

ఇష్టానుసారంగా తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది



చార్మినార్: టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ సిబ్బంది చెట్లను ఇష్టానుసారంగా నరికివేస్తున్నారు. వాస్తవానికి చెట్లను నరికేటప్పుడు ముందస్తుగా సంబంధిత ఫారెస్ట్ విభాగం అధికారుల నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అయితే కరెంటోళ్లు మాత్రం ఇవేవి పట్టించుకోకుండా అడ్డగోలుగా చెట్లను నరికి పచ్చదనానికి పాతర వేస్తున్నారు. తెలంగాణ హరితహారంలో భాగంగా రాష్ట్రంలో మొత్తం 230 కోట్ల మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకున్న రాష్ట్ర ప్రభుత్వం 2021 మే వరకు 217 కోట్ల మొక్కలను నాటారు. పట్టణాలు, గ్రామాల్లో కూడా పెద్ద ఎత్తున మొక్కల పెంపకం చేపట్టారు. అయితే కరెంటోళ్లు మాత్రం ఇవేవి పట్టించుకోకుండా కేవలం విద్యుత్ తీగలకు అడ్డొస్తున్న చెట్ల కొమ్మలను మాత్రం తొలగించాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా చెట్లనే పూర్తిగా నరికివేస్తున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఉన్నప్పటికీ.. పక్కన పెడుతున్నారు. ఆదివారం టీఎస్ఎస్‌పీడీసీఎల్ సౌత్ సర్కిల్‌లోని ఆస్మాన్‌ఘడ్ డివిజన్‌లో సిబ్బంది పురాతన చెట్లను ఎక్కడికక్కడ నరికివేశారు. ఆరు నెలలకొసారి ఫారెస్ట్ సంబంధిత అటవీ శాఖ అధికారుల నుంచి కేవలం కొమ్మలను మాత్రమే తొలగిస్తామని అనుమతులు పొందుతున్న విద్యుత్ శాఖ వారు.. అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఆస్మాన్‌ఘడ్‌లో పురాతన చెట్టును నరికివేస్తున్న సిబ్బంది

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

అబిడ్స్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని భారతీయ యోగ్ సంస్థాన్ యోగా గురువు సత్యనారాయణ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతి రోజూ కొంతసేపు అయినా యోగాసనాలు చేయాలన్నారు. భారతీయ యోగ్ సంస్థాన్ ఆధ్వర్యంలో కొన్ని ఏళ్లుగా ఉచిత అభ్యాసనాన్ని చేయిస్తున్న సత్యనారాయణను యోగా సభ్యులు ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... యాంత్రిక జీవనంలో యోగా చేయడంతోనే మానవాళి సుఖః సంతోషాలతో ఉంటాన్నారు. యోగా సభ్యులు మెట్టు వెంకటేష్, మహేష్ తివారీ మాట్లాడుతూ.. ఉచితంగా యోగా అభ్యాసనాన్ని చేయిస్తున్న సత్యనారాయణ జన్మదినం సందర్భంగా పలు ఆలయాల్లో పూజలు చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లత, సుధాకర్‌యాదవ్, జయశ్రీ, రాజు, శోభ, ఝాన్సీ పాల్గొన్నారు.



సత్యనారాయణను సత్కరిస్తున్న మెట్టు వెంకటేష్, మహేష్ తివారి తదితరులు

ఈటల రాజేందర్‌కు కేలండర్ అందజేత



చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయ కమిటీ రూపొందించిన 2023 వార్షిక కేలండర్‌ను ఫోర్‌మెన్ కమిటీ అధ్యక్షుడు పోసాని సురేందర్ ముదిరాజ్ బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ చరిత్ర, అమ్మవారి మహత్యమును ఎమ్మెల్యేకు వివరించారు. ప్రతినిధులు శ్రీకాంత్‌గౌడ్, సతీష్ ముదిరాజ్, నాగరాజు, ప్రభు, శేఖర్, అనిల్ పాల్గొన్నారు.

వార్షికోత్సవ వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ కాకేష్ జైస్వాల్

సుల్తాన్‌బజార్: ప్రెస్టిగియోస్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు జాంబాగ్‌లోని అశోక ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా రాకేష్ జైస్వాల్ హాజరై విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సంధ్య, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యువతను ఉన్నత అధికారులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం



బస్తీ యాత్రలో భాగంగా మైనార్టీ మహిళలతో చర్చిస్తున్న గడ్డం శ్రీనివాస్ యాదవ్

అఫ్జల్‌గంజ్: బస్తీల్లోని యువతను ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నతాధికారులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా దళితవాడలో బస యాత్ర విజయవంతంగా కొనసాగుతుందని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గడ్డం గంగాధర్ యాదవ్ ఫౌండేషన్ చైర్మన్ గడ్డం శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం దళితవాడలో బస యాత్ర 8వ విడతలో భాగంగా బేగంబజార్ డివిజన్‌లోని ఫీల్‌ఖానాలో బస్తీలో ఫీల్‌ఖానా వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ అయాజ్ ఉల్ హక్, జనరల్ సెక్రటరీ ఎంఏ అజీం, ఉపాధ్యక్షుడు ఎంఏ మాజీద్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 8వ విడత బసయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా బస్తీలోని మైనార్టీల ఇళ్లల్లోకి వెళ్లి వారి పిల్లలు ఏ విధంగా చదువుతున్నారు. ఎంతమంది చదువుతున్నారు. ఏ కారణాలతో చదువును ఆపివేశారు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గంలో దళితవాడలో బస యాత్ర కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు.

మహిళా యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌కు సన్మానం

అబిడ్స్: మహిళా యూనివర్సిటీ తొలి వైస్ చాన్సలర్‌గా నియమితులైన ఎం.విజ్జులతకు గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు సంతోష్‌గుప్తా, మాజీ కార్పొరేటర్ మమతా గుప్తా ఆదివారం పూలబొకేను ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రభుత్వం మహిళా అభ్యున్నతికి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నారన్నారు. రాష్ట్రంలో తొలి మహిళా యూనివర్సిటీని ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. మహిళా యూనివర్సిటీని ఏర్పాటు చేయడం ద్వారా మహిళా రంగం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.



ప్రొఫెసర్ విజ్జులతకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మమతా గుప్తా, సంతోష్‌గుప్తా

భారతీయ విలువలు ఎంతో గొప్పవి



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యాశంకర్ భారతి స్వామి

అఫ్జల్‌గంజ్: తల్లిదండ్రులను, గురువులను గౌరవించే లక్షణం మన సమాజంలో ఉన్నంత మరెక్కడా లేదని జగద్గురు పుష్పగిరి శంకరాచార్య పీఠాధిపతి విద్యాశంకర్ భారతి స్వామి అన్నారు. ఆదివారం గౌలిగూడలోని జంగల్ విఠోభా దేవాలయంలో భాగ్యనగర్ పురోహిత్ సంఘం అధ్యక్షుడు గోవింద్ రాజు మహారాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వస్తిశ్రీ శోభన నామ సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరణకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వచ్చే కాలం, పద్ధతులు, విషయాలను శాస్త్రీయంగా చెప్పడంలో కాలమానం ఎంతో కీలకమైందన్నారు. భారతీయ విలువలు ఎవరో పుట్టిస్తే రాలేదని, సమాజ పరిణామ క్రమంలో వేల సంవత్సరాల పరిశోధన, అభివృద్ధిలో వచ్చినవని, వాటిని నేర్చుకునేందుకు ప్రపంచం మన వైపు చూస్తోందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు సుధీర్ జోషి, సుధాకర్ శర్మ, గజానన్ కృష్ణ తివారి మహారాజ్, కార్యదర్శులు నర్సింహా జోషి, మాధవ్ కుంబారే, కోశాధికారులు సుధీర్ మస్లేకార్, యోగేష్ నాన్జాకర్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత రిమాండ్

పరారీలో మరో ఇద్దరు నిందితులు

డబీర్‌పురా: నిషేధిత గంజాయిని రవాణా చేస్తూ విక్రయిస్తున్న ఓ వ్యక్తిని దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా చెల్లా తండాకు చెందిన లావూరి నాగరాజు (28) నగరంలో కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో గంజాయికి బాగా డిమాండ్ ఉందని తెలుసుకున్నాడు. అవసరమైన వినియోగదారులకు గంజాయిని విక్రయించి సులభంగా డబ్బులు సంపాదించాలని పథకం వేశాడు. ఇందులో భాగంగా సూర్యాపేటకు స్నేహితులు సంతోష్, నాగరాజు వద్ద తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తన హుందాయి కారులో సరఫరా చేస్తూ అధిక డబ్బులు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. సమాచారం అందుకున్న దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు మీర్‌చౌక్ పోలీసులతో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నాగరాజును అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రూ.24 కేజీల గంజాయి, ఒక హుందాయి కారు, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం మీర్‌చౌక్ పోలీసులకు అప్పగించారు. దీంతో మీర్‌చౌక్ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

'రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయింది'

గోల్కొండ: రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని బీజేపీ నాయకుడు దేవర శ్రీనివాస్ అన్నారు. ఆదివారం గుడిమల్కాపూర్‌లోని జనహిత కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని జూనియర్, డిగ్రీ, ఉన్నత విద్య కళాశాలల్లో ర్యాంగింగ్‌ను అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మరోవైపు జూనియర్ కళాశాలల యాజమాన్యాల దౌర్జన్యాలకు విద్యార్థుల ఆత్మహత్యలు చేసుకుంటున్నారని కళాశాల హాస్టళ్లలోనే విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటుండటం ఎంతో బాధాకరమైన విషయమన్నారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు నిరసనగా తమ పార్టీ ఆధ్వర్యంలో నేడు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరగనున్న బీజేపీ నిరసన దీక్షకు గుడిమల్కాపూర్ నుంచి భారీగా తరలివెళ్తున్నామని పేర్కొన్నారు.

మాదకద్రవ్యాల విక్రేత అరెస్ట్

రాజేంద్రనగర్: మాదకద్రవ్యాలను విక్రయించేందుకు ప్రయత్నించిన ఓ వ్యక్తిని రాజేంద్రనగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి మూడు గ్రాములు ఎండీఎంఏ మాదకద్రవ్యంతో పాటు ఆడీ కారును స్వాధీనం చేసుకున్నారు. వివరాల ప్రకారం.. పాతబస్తీ ఖాజీపురా ప్రాంతానికి చెందిన మహ్మద్ అమీర్(28) వస్త్రాల వ్యాపారి. తన స్నేహితుడి వద్ద నుంచి ఐదు గ్రాముల ఎండీఎంఏను కొనుగోలు చేశాడు. రెండు గ్రాములు ఉపయోగించిన అనంతరం మూడు గ్రాములను ఇతరులకు విక్రయించేందుకు సిద్ధమైయ్యాడు. హిమాయత్‌సాగర్ రోడ్డు వద్ద విక్రయించేందుకు రాగా అప్పటికే సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. అనంతరం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్

రాజేంద్రనగర్: ఎండా కాలం నేపథ్యంలో రాజేంద్రనగర్ జీహెచ్‌ఎంసీ సర్కిల్ పారిశుద్ధ్య విభాగం ఆధ్వర్యంలో ఆదివారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. డివిజన్ల పరిధిలోని బస్తీలు, కాలనీలలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా ఏఎంహెచ్‌ఓ ఆంజనేయులు మాట్లాడుతూ.. ప్రజలు తమ ఇళ్లల్లోని చెత్తాచెదారాన్ని ఇంటి వద్దకు వచ్చే చెత్తసేకరణ దారులకు అందించాలన్నారు. ఏ ప్రాంతంలోనైనా చెత్త సేకరణదారులు రాకపోతే స్థానికంగా ఉండే కమిటీకి ఫిర్యాదు చేయాలన్నారు. ప్రతిరోజూ తాము చెత్తసేకరణదారుల నుంచి హాజరును తీసుకుంటున్నట్లు తెలిపారు. బస్తీలు, కాలనీలలోని చెత్తాచెదారాన్ని పోగు చేసి ఎవరైనా కాలుస్తే తమకు సమాచారం అందించాలన్నారు.

సండే.. సందడి



గుల్జార్‌హౌజ్ వద్ద సందర్శకుల సందడి

చార్మినార్: పాతబస్తీలోని పర్యాటక ప్రాంతాలన్నీ ఆదివారం సందర్శకులతో కిటకిటలాడాయి. పర్యాటకులు ఉదయం నుంచే పాతబస్తీకి క్యూ కట్టారు. దీంతో ఎటూ చూసినా.. సందడే.. సందడే కనిపించింది. చిరు వ్యాపారాలు జోరుగా కొనసాగాయి. అయితే గుల్జార్‌హౌజ్ వద్ద పురాతన గుల్జార్‌హౌజ్ ఫౌంటేన్ పనులు నత్తనడకన కొనసాగుతుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఎంతమంది ట్రాఫిక్ పోలీసులు విధి నిర్వహణలో ఉన్నప్పటికీ.. ఫౌంటేన్ పనుల కారణంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. అర్ధరాత్రి దాటిన అనంతరం ఫౌంటేన్ పనులు చేస్తే బాగుంటుందని స్థానిక వ్యాపారులు కోరుతున్నారు.

రొమ్ము కేన్సర్‌పై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న పద్మనాభయ్య

గన్‌ఫౌండ్రీ: రొమ్ము కేన్సర్‌ను తరిమి కొట్టాల్సిన అవసరం ఎంతగానో ఉందని కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి, పద్మశ్రీ డాక్టర్ పద్మనాబయ్య అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో విశాలక్ష్మి బ్రెస్ట్ కేన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రొమ్ము కేన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రొమ్ము కేన్సర్‌పై మహిళలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కేన్సర్‌ను తొలిదశలోనే గుర్తిస్తే సరైన శస్త్ర చికిత్స చేసుకోవడానికి వీలవుతుందని తెలిపారు. మద్యపానం, దూమపానం వంటి వాటి వల్ల అనేక మంది వివిధ రకాల కేన్సర్ల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ పి.రఘురామ్ మాట్లాడుతూ.. రొమ్ము కేన్సర్‌పై అవగాహన లేకపోవడం వల్ల ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా లక్షకు పైగా చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూట్యూబర్ గంగవ్వ, విశాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'జీవితం ప్రజా సేవకే అంకితం'



మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు దేవర వంశీ

గోల్కొండ: తండ్రి ఆశయ సాధనకు తన జీవితాన్ని ప్రజా సేవకే అంకితం చేస్తానని బీజేపీ నాయకుడు దేవర వంశీ అన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకులు గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దివంగత దేవర కరుణాకర్ సంతాప సభతో పాటు దేవర వంశీ పరిచయ కార్యక్రమం ఆదివారం గుడిమల్కాపూర్ డివిజన్‌లోని ఉప్పరబస్తీ, రామచంద్రయ్య కమ్యూనిటీహాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుడిమల్కాపూర్‌లో బీజేపీని అజేయమైన శక్తిగా తన తండ్రి తీర్చిద్దిదారని, దానిని మరింత బలోపేతం చేసేందుకు తనవంతు కృషిచేస్తానని ఆయనఅన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బోడి అశోక్‌యాదవ్, దేవర శ్రీనివాస్, నామ యాదగిరి, సందేశ్ యాదవ్, జొన్నకంటి మధుసూదన్, మురారియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు



గోల్కొండ: సేవా దృక్పథంతో చలివేంద్రాలను ఏర్పాటు చేసి స్వచ్ఛమైన తాగు నీటిని ప్రజలకు ఏఎంఆర్ ఎంటర్‌ప్రైజెస్ ద్వారా అందిస్తున్నారు. పాతబస్తీలోని ఆసిఫ్‌నగర్, సీతారాంబాగ్, మెహిదీపట్నం, తాళ్లగడ్డతో పాటు టోలీచౌకి, షేక్‌పేట్ తదితర ప్రాంతాల్లో చలివేంద్రాలను ఉచితంగా ఏర్పాటు చేసి స్వచ్ఛమైన తాగునీటిని అందజేస్తున్నట్లు నిర్వాహకులు కృష్ణ మోహన్ కుమార్ తెలిపారు. అదేవిధంగా ప్రజలకు చలివేంద్రాల్లో ఆర్ఓ నీళ్లను శాస్త్రీయ పద్ధతిలో స్టాండ్లు ఏర్పాటు చేసి ఇసుకపై మట్టికుండలను పెట్టి నీటిని అందిస్తున్నామని తెలిపారు. బోరు నీటిని తాగునీటిగా మార్చే విధానంపై కూడా అవగాహన క్యాంపును నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. చలివేంద్రాల ఏర్పాటు, వాటర్ ప్యూర్‌ఫైర్‌లపై సలహాల కోసం 80900 20077, 80900 80077 లలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

కార్వాన్‌లో చివరి దశకు డ్రైనేజీ పనులు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న షబ్బీర్‌ఖాన్ తదితరులు

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో సుమారు రూ.300 కోట్లతో జరుగుతున్న డ్రైనేజీ పనులు చివరి దశలో ఉన్నాయని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. నానల్‌నగర్ డివిజన్ ఖాదర్‌బాగ్‌లో కొత్త డ్రైనేజీ పనులు చేయించిన సందర్భంగా ఖాదర్‌బాగ్ మజ్లిస్ ఏరియా కమిటీ సభ్యులు ఆదివారం ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మజ్లిస్ వర్గ బేధాలు, వివక్షకు తావులేదని స్పష్టం చేశారు. కార్వాన్ నియోజకవర్గంలోని అవసరం ఉన్న అన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ పనులు జరుగుతున్నాయన్నారు. మజ్లిస్ సెక్యులర్ పార్టీ అన్ని వర్గాల ప్రజలకు చెందిన ప్రార్థనా స్థలాలును, శ్మశాన వాటికలను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కే బిల్డర్స్ అండ్ డెవలపర్స్ చైర్మన్ షబ్బీర్ ఖాన్, నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, తదితరులున్నారు.

రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్‌కు సన్మానం

గోల్కొండ: మైనార్టీల హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ తారీఖ్ అన్సారీ అన్నారు. ఆదివారం అడ్వకేట్స్ ఫోరం ఫర్ జస్టిస్ ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫోరం అధ్యక్షుడు వహీద్ అహ్మద్, మీర్ వాజిద్ అలీఖాన్, మహ్మద్ మసీవుద్దీన్, వాహెహ్ అలీఖాన్, ఎంఏ షకీల్ తదితరులున్నారు.



తారీఖ్ అన్సారీని సన్మానిస్తున్న దృశ్యం

శుభాకాంక్షలు

చాంద్రాయణగుట్ట: రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన తారీఖ్ అన్సారీకి బీఆర్ఎస్ చాంద్రాయణగుట్ట డివిజన్ అధ్యక్షుడు జుర్కీ రాజేందర్ ఆదివారం శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నాయకుడు ఖాజాతో కలిసి చైర్మన్‌కు పూలబొకే అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా జుర్కీ రాజేందర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు.

నఫీజ్ కళకు అంతర్జాతీయ గుర్తింపు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మామిడి హరికృష్ణ తదితరులు

గన్‌ఫౌండ్రీ: నాలుగు గోడలకే పరిమితమైన నఫీస్ కళను సామాజిక వేత్త ఖాజా అఫ్రీది అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లడం అభినందనీయమని భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో వరల్డ్ ఆర్ట్ దుబాయ్ ఎగ్జిబిషన్‌లో పాల్గొనే టటువంటి చిత్రాల వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మామిడి హరికృష్ణ మాట్లాడుతూ.. ఈనెల 9 నుంచి 12వ తేదీ వరకు దుబాయ్ వేదికగా జరిగే ఎగ్జిబిషన్‌లో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత్రి ఐనంపూడి శ్రీలక్ష్మీ, సాహితీవేత నాళేశ్వరం శంకరం, కవయిత్రి మెర్సీ మార్గరెట్ అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి నిత్యాన్నదాన సత్రానికి విరాళాలు



విరాళాలు అందజేస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

గోల్కొండ: బాసరాలోని అఖిల భారత పద్మశాలి నిత్యాన్నదాన సత్రానికి పద్మశాలి సంఘాల నుంచి విరాళాలు వస్తున్నాయని సత్రం అధ్యక్షుడు రాపోలు సుధాకర్ అన్నారు. ఆదివారం కార్వాన్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు జూలూరి మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి అంబటి శ్రీనివాస్ సత్రానికి తమవంతు విరాళంగా రూ.51 వేల చెక్కును అందజేశారు. అదే విధంగా కార్వాన్ మార్కండేయ భవన్ ట్రస్ట్ అధ్యక్ష కార్యదర్శులకు కాడిగ పాండయ్య, సప్పాల హరిదాసులు రూ.51 వేల చెక్కును అందజేశారు. బాసరలో నిర్మిస్తున్న పద్మశాలి నిత్యాన్నదాన సత్ర భవనానికి ఈ నిధులు వాడుతామని సత్రం అధ్యక్షుడు రాపోలు సుధాకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో గజం గురునాథం, పద్మశాలి సంఘం గౌరవ, అధ్యక్షులు గుండు గోపాల్, నర్సింగరావు తదితరులున్నారు.